పిరమిడ్ నిర్మాణంతో ఈ ప్రాంతానికి

ప్రపంచవ్యాప్త గుర్తింపు

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం
- పాల్గొన్న నాయకులు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు

ధ్యాన మహాయాగంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, డిసెంబర్ 27 : మహేశ్వర మహా పిరమిడ్ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం-3 మహాసభలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం5 నుంచి 8 గంటల వరకు సంజయ్‌కింగ్-గణేశ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో మాజీ ఎమ్మెల్యే, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, శ్రీను, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ కారణజన్ముడని, ప్రపంచంలోని కోట్ల మందికి ధ్యానాన్ని అందించారన్నారు. నియోజకవర్గంలో మహా పిరమిడ్ నిర్మాణంతో ఈ ప్రాంతంలోని ప్రజలు ఆయన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. పత్రీజీ కలలుగున్న శాఖహార జగత్‌కు, ఆశయ సాధనకు ధ్యానులు కృషి చేయాలన్నారు. విశాఖపట్నం ఎంపీ భరత్ మహాశ్వర మహా పిరమిడ్‌తోపాటు సుభాశ్ పత్రీజీ శక్తిస్థల్‌ను సందర్శించారు. అనంతరం ధ్యాన గురువులు, పిరమిడ్ మాస్టర్లు రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలను ట్రస్ట్ సభ్యులతో కలిసి విజయభాస్కర్‌రెడ్డి ఆవిష్కరించారు. సాయంత్రం ప్రధాన వేదికపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మీడియా కో-ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీరాంగోపాల్, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, సాంబశివరావు, నిర్మల, హనుమంతురావు, చంద్రశేఖర్, నర్సింహ, రాజేశ్, రాంబాబు, హనుమంతురాజు,బాలకృష్ణ, లక్ష్మి, మాధవి, నిర్మల, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

కేటీఆర్ కలిసిన అవినాశ్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి తదితరులను షాబాద్ యువ నేత పట్నం అవినాశ్‌రెడ్డి శుక్రవారం తన జన్మదినం సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడుతున్న అవినాశ్‌రెడ్డికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు.

-షాబాద్, డిసెంబర్ 27

మాజీ ఎమ్మెల్యే పట్నంకు సన్మానం

లగచర్ల రైతుల కోసం జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని శుక్రవారం నగరంలోని వారి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద పటేల్, మాజీ జడ్పీటీసీ మహిపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

-వికారాబాద్, డిసెంబర్ 27

మాజీ ప్రధానికి స్పీకర్ సంతాపం

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం పట్ల రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దేశం ఓ గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా ఆయన దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు స్పీకర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

-వికారాబాద్, డిసెంబర్ 27

హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ సీనియర్ నేత

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కెప్టెన్ అంజన్‌గౌడ్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతి, అయ్యప్పస్వామి ప్రసాదాన్ని అందజేశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని.. ప్రభుత్వ మోసాలను ఎప్పటికప్పుడు ఎండకట్టాలని సూచించినట్లు అంజన్‌గౌడ్ తెలిపారు. హరీశ్‌రావును కలిసిన వారిలో గవర్నమెంట్ జూనియర్ కాలేజెస్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ కుమార్ తదితరులు ఉన్నారు.

-చేవెళ్ల రూరల్, డిసెంబర్ 27

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, మౌనం పాటిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

మమ్మల్ని రెగ్యులరైజ్ చేయరూ..

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు
- కొనసాగుతున్న దీక్షలు

వికారాబాద్, డిసెంబర్ 27 : తమను క్రమబద్ధీకరించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారానికి 22వ రోజుకు చేరాయి. ముందుగా మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గంగ్యానాయక్ మాట్లాడుతూ..పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు ప్రభావతి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, డీపీవో శేఖర్, పీటీఐ రవికుమార్, ఆయా మండలాల కేజీబీవీ పాఠశాలల ఎస్‌వోలు, అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అస్మత్‌పూర్, బోడకొండలలోని ప్రధాన రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

కనిపించని కల్లాలు..

రోడ్లపైనే వడ్లు..

ప్రమాదాల బారిన వాహనదారులు

చేతికొచ్చిన ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్ల పక్కన ధాన్యాన్ని ఆరబెడుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు తమ వడ్లను ఆరబెట్టుకునేందుకు స్థలాలు, కల్లాలు లేకపోవడంతో రోడ్లపై ధాన్యం కుప్పలతోపాటు కల్లాలను ఏర్పాటు చేసుకుంటుండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు తప్పని పరిస్థితిలో కల్లాల పైకి వాహనాలను ఎక్కించి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వడ్లను ఆరబెట్టుకునేందుకు కల్లాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

-మంచాల, డిసెంబర్ 27

ఎంసీసీ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

సిటీబ్యూరో : జల మండలి మెట్రో కస్టమర్ కేర్ (ఎంసీసీ)కి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తాగునీటి సరఫరా, కలుషిత నీటి సమస్యల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈడీ మయాంక్ మిట్టల్‌తో కలిసి ఓ అండ్ ఎం అధికారులతో ఎంసీసీ ఫిర్యాదులపై ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నాం

తాము అతి తక్కువ వేతనంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నాం. తమకు ప్రభుత్వం చెల్లిస్తున్న రూ. 11,700 వేతనం సరిపోవడంలేదు. తమను వెంటనే విద్యాశాఖలో విలీనం చేసి.. అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలి.

-రవికుమార్, పీటీఐ సంఘం జిల్లా అధ్యక్షుడు

హైలైఫ్ ఎగ్జిబిషన్ షురూ..

హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ లైఫ్ స్టైల్ అండ్ వెడ్డింగ్ షాపింగ్ స్పెషల్ హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటీమణులు కామాక్షి భాస్కర్ల, శుభశ్రీ రాయగురు, స్రవంతితో కలిసి ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో డిజైనర్ వేర్, వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 29వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ)

94 వేల ఇండ్లల్లో సర్వే పూర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా మంజూరు చేసిన నేపథ్యంలో, జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది. ప్రభుత్వం గతంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు మాత్రమే సర్వే చేయాలని నిర్దేశించిన తరుణంలో 10,70,446 మంది ఇందిరమ్మ ఇండ్లకు విన్నవించారు. దీంతో సర్వే చేసేందుకు వార్డుల వారీగా టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 883 లాగింగ్ కేటాయించగా, 94వేలకు పైగా సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు. వార్డుల వారీగా డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో సర్వే జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

రేపు కొమురెల్లి మల్లన్న కల్యాణం

జాతరకు భారీగా తరలి రానున్న భక్తులు

చేర్యాల, డిసెంబర్ 27: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. ఇప్పటికే ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. మంత్రులు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వరుడు మల్లికార్జున స్వామి తరపున పడిగన్న గారి వంశస్తులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవి తరపున మహాదేవుడి వంశస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపిస్తారు. ఆదివారం ఉదయం 10:45 గంటలకు కొమురవెల్లి క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలోని తోటబావి వద్ద గల కల్యాణ వేదికలో 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య స్వామి ఆధ్వర్యంలో వేద పర్యవేక్షణలో కల్యాణం జరగనున్నది. ఉత్సవాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు.

వేలాదిగా తరలి రానున్న భక్తులు

మల్లన్న కల్యాణోత్సవానికి 30 వేల వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయ వర్గాలు తెలిపాయి. కల్యాణ వేదిక వద్ద భద్రతా నిమిత్తం మరో ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మించిన భవనంలో ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 60 వేల లడ్డూ ప్రసాదాలు, ఐదు క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లను తయారు చేయిస్తున్నారు. సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వ్యర్థాల సేకరణ, విద్యుదుత్పత్తిపై

ఇలంబర్తి ఆరా

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి శుక్రవారం అధికారులతో కలిసి జవహర్‌నగర్‌లోని మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఆర్ఎఫ్ఐడీ విధానం అమలు, వెయింగ్ బ్రిడ్జిలు, వ్యర్థాల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి రోజూ జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు 8,500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నట్లు అధికారులు వివరించారు. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తిపై ఆరా తీశారు. 24 మెగా వాట్ల వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్, రెండో ఫేస్ ప్లాంట్ పనులను పరిశీలించారు. 2014లో రోజు 3,500 మెట్రిక్ టన్నుల వ్యర్థాల నుంచి ప్రస్తుతం 8,500 టన్నుల వరకు వ్యర్థ సామర్థ్యం చేరిందని, వేస్ట్ టూ ఎనర్జీలోనూ ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని అధికారులు కమిషనర్‌కు వివరించారు.

ఎన్ఏఏఎస్ ఫెలోకు ఎన్ఐఎన్ సైంటిస్ట్

నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఫెలోగా జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) పరిశోధకులు భాను ప్రకాశ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఎన్ఐఎన్ బయో కెమిస్ట్రీ విభాగాధిపతిగా పని చేస్తూ న్యూట్రిషనల్ సైన్స్‌లో ఆయన చేసిన పరిశోధనలకు ఫెలోషిప్‌నకు ఎంపిక చేసినట్లుగా ఎన్ఐఎన్ వర్గాలు పేర్కొన్నాయి.

పుస్తక ప్రదర్శన.. జన రంజకం

పుస్తక ప్రేమికులు, పలువురు సాహితీవేత్తల నడుమ పలు పుస్తకాల ఆవిష్కరణ

పుస్తక ప్రియులతో వివిధ వేదికలు, స్టాళ్లు కిటకిట

'వార్తలు సమాప్తం - లోపలి కథ మొదలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీ శంకర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, కవి యాకూబ్, కోయ చంద్రమోహన్ తదితరులు

'మల్లెల తీర్థం - మహా ఖననం' పుస్తకావిష్కరణలో బీఎస్ రాములు, ప్రముఖ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్, పీవోడబ్ల్యూ సంధ్య, తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 27: ఇందిరా పార్క్ సమీపంలోని కళాభారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పుస్తక ప్రియుల సందడి కొనసాగుతున్నది. శుక్రవారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. బుక్ ఫెయిర్ రెండు వేదికలపై పలు సాహితీ కార్యక్రమాలతో పాటు పుస్తకావిష్కరణలతో కళకళలాడుతున్నాయి. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాకూబ్, ఆర్.వాసులు మాట్లాడుతూ ప్రజల నుంచి భారీ స్పందన వస్తున్నదన్నారు. మరో రెండు రోజుల్లో బుక్ ఫెయిర్ ముగియనుందని, పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ఈ ఫెయిర్‌ను సందర్శించారు.

'వార్తలు సమాప్తం.. లోపలి కథ మొదలు' ఆవిష్కరణ

'చరిత్ర సగం రాసిన వాక్యం' అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ అన్నారు. తెలంగాణ పబ్లికేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ పీవీ రావు రచించిన వ్యాసాల సంకలనం 'వార్తలు సమాప్తం.. లోపలి కథ మొదలు'' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని బుక్ ఫెయిర్ వేదికపై నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మల్లన్న సాగర్ రైతుల పక్షం నిలిచినట్లుగానే లగచర్ల అంశం పట్ల స్పందించాలన్నారు. జర్నలిస్టుల వాక్యాలకు పదను వుంటుందన్నారు. సామాజిక చింతన వున్న వారే గొప్ప జర్నలిస్టులు అవుతారని పేర్కొన్నారు. రచయిత పీవీ రావు నన్ను కదిలించిన సంఘటనలు రాశారన్నారు. కవి, కేంద్ర సాహిత్య అకాడమీ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మిమిక్రీ ఆర్టిస్ట్ రమేశ్, సింగరేని మాజీ డైరెక్టర్ డీఎల్ ఆర్.ప్రసాద్, కొండపల్లి పవన్, తెలంగాణ పబ్లికేషన్ నిర్వాహకులు చంద్రమోహన్, కవి తంగిరాల చక్రవర్తి పాల్గొన్నారు.

'నాగ స్వరం' పుస్తకావిష్కరణ

కోయి కోటేశ్వర రావు 'నాగ స్వరం' కవితా సంపుటి అంబేద్కర్, పూలే భావజాలానికి అక్షర రూపం అని సుప్రసిద్ధ కవి శిఖామణి అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తోపుడు బండి సాదిక్ వేదికపై కోయి కోటేశ్వర రావు రచించిన 'నాగ స్వరం' కవితా సంపుటిని ముఖ్య అతిథిగా శిఖామణి ఆవిష్కరించి మాట్లాడారు. అస్తిత్వ ఉద్యమాల భావజాలాన్ని శక్తివంతంగా తన కవిత్వంలో కోటేశ్వర రావు ఆవిష్కరించారని అన్నారు. నాగ స్వరంలో కోటేశ్వర రావు కవిత్వం, విమర్శ పరిశోధన లాంటి భిన్న ప్రక్రియల్లో బహుముఖీన ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. సభలో ప్రముఖ విమర్శకులు డా. సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, కోయి కోటేశ్వర రావు రాసిన కవిత్వంలో గొప్ప జీవన ఆర్తి ఉందని, ఫాసిజంపై తీవ్రంగా వ్యతిరేకించే తత్త్వం ఉందన్నారు. ప్రముఖ సాహితీ వేత్త పసునూరి రవీందర్ మాట్లాడుతూ, కోయి కవిత్వం తనకెంతో ఇష్టమని వస్తు రూపాలను సముచితంగా సమన్వయం చేస్తూ పది కాలాలు నిలిచి పోయే కవిత్వం రాశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన యోగి వేమన వర్శిటీ ఆచార్యులు వినోదిని మాట్లాడుతూ కోయి కవిత్వంలో సమాజం పట్ల ధర్మాగ్రహంతో పాటు ఆర్ద్రత కూడా కనిపిస్తుందన్నారు. బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్, ప్రభుత్వ సిటీ కళాశాల ఆచార్యులు డా. నీరజ ప్రముఖ కథా రచయిత విజయ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

'అరుణిమ', 'త్రికాల్' చారిత్రాత్మక నవల ఆవిష్కరణ

రచయిత్రి డాక్టర్ సంధ్య విప్లవ్ పుస్తకం 'అరుణిమ', 'త్రికాల్' చారిత్రాత్మక నవల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత బీఎస్ రాములు మాట్లాడుతూ, ఉద్యమాలు చేసిన కాలం నాటి రోజులను ఈ పుస్తకం గుర్తు చేసిందన్నారు. ఈ పుస్తకంలోని కథనం చాలా ఉద్వేగపూరితంగా సాగిందని తెలిపారు. ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ సతీశ్ చందర్, ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ, అట్టడుగున ఉన్న వర్గాల వాళ్లు రాయకపోతే సమాజానికి చాలా నష్టం అని పేర్కొన్నారు. ఒక స్త్రీ కలం పట్టడం, స్త్రీ జీవితాన్ని రాయడం సాధారణ విషయం కాదన్నారు. సమావేశంలో ప్రముఖ రచయిత, వీక్షణం పత్రిక వ్యవస్థాపకుడు ఎన్.ఆవేణుగోపాల్, కోయి కోటేశ్వర రావు, పీఓడబ్ల్యు నాయకురాలు సంధ్య, భంగ్యానాయక్, బండారు విజయ తదితరులు పాల్గొన్నారు.

'మల్లెల తీర్థం మహా ఖననం' పుస్తకావిష్కరణ

బుక్ ఫెయిర్ వేదికపైన రచయిత సిద్ధార్థ కవిత్వం 'మల్లెల తీర్థం మహా ఖననం' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పీఓడబ్ల్యూ సంధ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత సృష్టించిన కవిత్వం అంతా ప్రజల కోసమే అని ఆమె అన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత బీఎస్ రాములు మాట్లాడుతూ, ఈ పుస్తకంలో తెలంగాణ భాషను అద్భుతంగా కవిత్వీకరించారని తెలిపారు. ఏలె లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, అంబటి సురేంద్రరాజు, కవి యాకూబ్ పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీతోనే అభివృద్ధి

అబిడ్స్, డిసెంబర్ 27: సైన్స్ అండ్ టెక్నాలజీని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడంతోనే అభివృద్ధి జరుగుతుందని, సాంకేతిక తలో కృత్రిమ మేధ ప్రాముఖ్యత కలిగి ఉన్నదని వియత్నాం దేశానికి చెందిన హనోయ్ యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ న్యూయెన్ హంసంగ్ అన్నారు. స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో తొమ్మిదో అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రీసెర్చ్ ఇంటెలిజెంట్ కంప్యూటర్ ఇంజనీరింగ్ (రైస్-2024)పై మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైద్రాబాద్, యూనివర్సిటీ ఆఫ్ డాన్‌బాస్కో ఎల్ సాల్విడార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు విదేశాలకు చెందిన వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అంతర్జాతీయ సదస్సు ప్రారంభానికి ముందుగా హాజరైన అతిథులు, కళాశాల కరెస్పాండెంట్ కృష్ణారావు, దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అంతర్జాతీయ సదస్సు (రైస్-2024)కు కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వప్న అధ్యక్షత వహించగా, వియత్నాం దేశానికి చెందిన హనోయ్ యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ న్యూయెన్ హంసంగ్ గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కంప్యూటర్ రంగంలో నేడు కృత్రిమ మేధ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. మలేషియా దేశానికి చెందిన లింకల్న్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మిథున్ చక్రవర్తి మాట్లాడుతూ... గణన శాస్త్రానికి సంబంధించిన పరిశోధనలు ఇంజినీరింగ్ పరిజ్ఞానం పెరిగేందుకు సహకరిస్తాయని పేర్కొన్నారు.